నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

శుక్రవారం 15 డిసెంబర్ 2023
FRIDAY, DECEMBER 15, 2023

VIKARABAD

పేజీలు : 8
PAGES


### శాసనసభాపతిగా

# గడ్డం ప్రసాద్‌కుమార్

- స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వికారాబాద్ ఎమ్మెల్యే
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు



వికారాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): శాసనసభాపతిగా గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మూడోసారి వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఎంపీటీసీ నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం ఆరంభమై ఉన్నతమైన స్పీకర్ పదవి దక్కడంపై వికారాబాద్ నియోజకవర్గంతోపాటు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన 21 ఏండ్ల రాజకీయ జీవితంలో గడ్డం ప్రసాద్ కుమార్ 2002లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మర్పల్లి మండలంలోని కొంశెట్టిపల్లి నుంచి ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ఎన్నికయ్యారు. అనంతరం 2008లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా వికారాబాద్ సెగ్మెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ వికారాబాద్ నియోజకవర్గం నుంచే కాంగ్రెస్ పార్టీ తరపున రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో చేనేత, జౌళిశాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా రెండు పర్యాయాలు ఓడిపోయారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రసాద్‌కుమార్ వికారాబాద్ సెగ్మెంట్ నుంచే మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రస్తుతం స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్‌గా ఎంపిక కావడంపై హర్షిస్తూ ప్రసాద్‌కుమార్‌కు పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలతోపాటు జిల్లాకు చెందిన పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.







ఇటీవల కట్టాల్‌లో జరిగిన శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

# సమస్తం నిక్షిప్తం

- ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం
- యూ డైస్ ప్లస్ వెబ్ సైట్‌ను రూపొందించిన విద్యాశాఖ
- రంగారెడ్డి జిల్లాలోనూ కొనసాగుతున్న ప్రక్రియ
- జిల్లాలోని 3,126 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారమంతా ఒకే చోట ఎంట్రీ
- ఈ నెలాఖరు లోగా పూర్తికి అధికారుల చర్యలు


7లో


విద్యావ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకేచోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నది. అందుకోసం యూ డైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్)వెబ్‌సైట్‌ను రూపొందించింది. దీంతో ఇకపై ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పూర్తి సమాచారమంతా వెబ్‌సైట్‌లో ప్రత్యక్షం కానున్నది. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంతోపాటు మౌలిక వసతులు ఏ పాఠశాలలో ఎలా ఉన్నాయో.. ఎంతమంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారో అనే విషయాలు స్పష్టంగా తెలియనున్నాయి. కాగా జిల్లాలోనూ విద్యాశాఖ అధికారులు ఈ దిశగా చర్యలను ముమ్మరం చేశారు. 1 నుంచి 12 తరగతుల వరకు మొత్తం విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల సమాచారాన్ని కూడా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా జిల్లాలో ఉన్న 3,126 పాఠశాలల సమాచారాన్ని సేకరించి అందుబాటులోకి తీసుకురానున్నారు.

–రంగారెడ్డి, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ)



# టార్గెట్ @ 40.48 లక్షలు

## వచ్చే ఏడాది హరితహారం లక్ష్యం ఖరారు

- వికారాబాద్ జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు
- అటవీ శాఖ పరిధిలోని 14 నర్సరీల్లోనూ..
- రోడ్లకు ఇరువైపులా..అటవీ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో నాటేందుకు ప్లాన్
- గతేడాది 39.69 లక్షల మొక్కలను నాటిన జిల్లా యంత్రాంగం




8లో


పచ్చదనాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా వచ్చే ఏడాదిలో 40.48 లక్షల మొక్కలను నాటాలని వికారాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ హరితహారం ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ మేరకు శాఖల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లోని నర్సరీలతోపాటు అటవీ శాఖ ఆధ్వర్యంలోని 14 నర్సరీల్లోనూ మొక్కలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. మొక్కలను నాటేందుకు గుంతలు తీసే ప్రక్రియ నుంచి మొక్కలు నాటే వరకూ ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయనున్నారు. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా.. అటవీ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటేందుకు ప్లాన్ చేస్తున్నారు. టేకు, శ్రీగంధం, ఉసిరి, నల్లమద్ది, పూలు, పండ్లు తదితర మొక్కలను నాటనున్నారు. కాగా గతేడాది జిల్లాలో 40.49 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టుకొని 39.69 లక్షల మొక్కలను నాటారు.

-వికారాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ)